సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం । 22 । సెప్టెంబర్ । 2024



సోమశిలలో 50.993 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శనివారం సాయంత్రానికి 50.993 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైనుంచి 10,867 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.76,670
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,960
మూడు శాతం జీఎస్టీతో	రూ.7,160
నవర (8 గ్రాములు)	రూ.57,280

గరిష్ఠం/కనిష్ఠం 33.8 /26.2

వాతావరణం

జిల్లాలో ఆదివారం అక్కడక్కడా చిరు జల్లులు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. శనివారం గాలిలో తేమ 60 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

24 నుంచి పొలం పిలుస్తోంది

నెల్లూరు(సెంట్రల్): ఈ నెల 24వ తేదీ నుంచి పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఈ మేరకు పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి రైతుకు వ్యవసాయం సులభతరంగా, లాభసాటిగా మార్చేందుకు నూతన సాంకేతిక పద్ధతులను తెలపడం కార్యక్రమ ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యాన, మత్స్య, మార్కెటింగ్, పట్టుపరిశ్రమ శాఖల శాస్త్రవేత్తలు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి సత్యవాణి, ఉద్యానశాఖ అధికారి సుబ్బారెడ్డి, మత్స్యశాఖ అధికారి నాగేశ్వరరావు పలువురు అధికారులు పాల్గొన్నారు.

27 నుంచి స్కూల్ గేమ్స్‌కు బాల, బాలికల జట్ల ఎంపికలు

నెల్లూరు (టౌన్): నెల్లూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 14, 17 బాల, బాలికల ఎంపికలను నిర్వహించనున్నట్లు డీఈఓ పీవీజే.రామారావు తెలిపారు. శనివారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో జట్ల ఎంపికల తేదీలకు సంబంధించి పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 27న అథ్లెటిక్స్, స్విమ్మింగ్, హ్యాండ్‌బాల్, బాక్సింగ్, రెజ్లింగ్, సాఫ్ట్ టెన్నిస్, టెన్నిస్, 28న టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్, రోప్ స్కిప్పింగ్, ఖోఖో, రగ్బీ, యోగా, ఫెన్సింగ్, నెట్‌బాల్, 30న ఆర్చరి, బాస్కెట్‌బాల్, క్రికెట్, బాల్‌బ్యాడ్మింటన్, చెస్, బేస్‌బాల్, సైక్లింగ్, క్యారమ్స్ తదితర వాటిల్లో ఎంపికలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరి విజయ, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

రికార్డులను తనిఖీ చేసిన జేసీ



రికార్డులను పరిశీలిస్తున్న జేసీ కార్తీక్

పొదలకూరు: పూర్వ తహసీల్దార్ల సమయంలో భూముల పంపిణీలో అవకతవకలు జరిగాయని తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో శనివారం జాయింట్ కలెక్టర్ కార్తీక్ రికార్డులను పరిశీలించేందుకు రెవెన్యూ కార్యాలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా జేసీ మండలంలోని మరుపూరు, ప్రభగిరిపట్నం, వావింటపర్తి, ఇనుకుర్తి, బత్తులపల్లి, కొత్తకంభాలపల్లి, నేదురుమల్లి వీఆర్వోల ద్వారా రికార్డులను తెప్పించుకుని పరిశీలించి వివరాలు సేకరించారు. భూముల పంపిణీకి సంబంధించి లోకాయుక్తకు కూడా ఫిర్యాదు వచ్చిందని వెల్లడించారు. జేసీ వెంట నెల్లూరు ఆర్డీఓ ఎ.మలోల, తహసీల్దార్ ఎం.సారంగపాణి తదితరులు ఉన్నారు.

అసైన్‌మెంట్ భూములపై ఆర్డీఓ సమీక్ష

చేజర్ల: చేజర్ల తహసీల్దార్ కార్యాలయంలో అసైన్‌మెంట్ భూములపై రెవెన్యూ అధికారులతో ఆత్మకూరు ఆర్డీఓ కే మధులత శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో అసైన్‌మెంట్ భూములను రెవెన్యూ సిబ్బంది త్వరితగతిన పరిశీలన చేసి నివేదిక తనకు అందజేయాలన్నారు. ప్రతి సోమవారం ప్రజా విజ్ఞప్తుల రోజు భూ సమస్యలను పరిష్కరించాలన్నారు. ఆ రోజు వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఏవీ రమణారావు పాల్గొన్నారు.

ముగ్గురు గంజాయి విక్రేతల అరెస్ట్



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీధర్, పక్కన సీఐ జీ రాజేశ్వరరావు, ఎస్‌ఐ సీహెచ్ తిరుమలరెడ్డి

కావలి: విశాఖపట్నం జిల్లా పాడేరు ఏజెన్సీ ప్రాంతం నుంచి గంజాయిని కావలికి తీసుకువచ్చి, వాటిని చిన్న ప్యాకెట్లలో అమ్మకాలు చేస్తున్న ముగ్గురు యువకులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 4.45 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు కావలి డీఎస్పీ పి.శ్రీధర్ చెప్పారు. డీఎస్పీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. పట్టణంలోని బుడమగుంటకు చెందిన గోసల గోపీకృష్ణ, అల్లాడి మణి, ముసునూరుకు చెందిన సుదర్శి అన్వేష్‌లతో పాటు అమ్మకానికి నిల్వ చేసి ఉన్న గంజాయితో పాటు రెండు సెల్‌ఫోన్లను కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను అరెస్ట్ చేయడంలో కావలి రూరల్ పోలీస్‌స్టేషన్ సీఐ జీ రాజేశ్వరరావు, ఎస్‌ఐ సీహెచ్ తిరుమల రెడ్డి, సిబ్బంది ఆర్.రాధయ్య, ఎస్‌ఎన్ రాజేష్, కె.ప్రసాద్, జె.అయోధ్యకుమార్, ఎస్‌కే ఇర్షాద్ పాల్గొన్నారని డీఎస్పీ వివరించారు.

ఏమీ కొనలేం.. ఏమీ తినలేం

నింగినంటిన నిత్యావసరాల రేట్లు

కంది పప్పు కొండెక్కి కూర్చుంది. నూనె సలసలా కాగుతోంది. కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయి. పెరిగిన నిత్యావసరాల ధరలు జిల్లాలో సామాన్యులకు చుక్కలు చూపెడుతున్నాయి. ఏం కొనాలి.. ఏం తినాలి అంటూ జనం ఆందోళన చెందుతున్నారు. లక్షలాది కుటుంబాలు నిత్యావసరాలు కొనలేక అల్లాడి పోతున్నాయి. చౌక దుకాణాల ద్వారా అందాల్సిన సాయం కూడా కరువవ్వడంతో తమకెవరు దిక్కంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



> **సతమతమవుతున్నాం**
>
> 
>
> ఇప్పటికే అన్ని రకాల ధరలు పెరిగాయి. నిత్యావసర సరుకులు కొనలేని పరిస్థితి ఉండటంతో బతుకుదెరువు కష్టంగా మారింది. మరలా వంటనూనెల ధరలు పెరగడం సామాన్యులపై పెనుభారం. నూనె ధరల పెరగడం వల్ల మిగిలిన ఆహార వస్తువుల ధరలు పెరుగుతాయి. ప్రభుత్వం ధరలు నియంత్రించి పేదలకు ధరలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. – విజయలక్ష్మి, గృహిణి, సీతారామపురం

> **ధరలు నియంత్రించాలి**
>
> 
>
> పెరిగిన సరుకుల ధరలతో ఏమీ కొనలేకున్నాం. ఇప్పుడు నూనె ధరలు అమాంతంగా పెరిగాయి. దీంతో సామాన్య ప్రజలపై భారం పడుతుంది. ప్రభుత్వం ధరలను నియంత్రించాలి.
> – సుజాత, గృహిణి, సీతారామపురం

- అమాంతంగా పెరిగిన నూనెల ధరలు
- కృత్రిమ కొరత సృష్టిస్తున్న కొందరు వ్యాపారులు
- ధరలు చూసి బెదిరిపోతున్న సామాన్యులు
- పట్టించుకోని మార్కెటింగ్, పౌరసరఫరాల అధికారులు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు/సాక్షి నెట్‌వర్క్: వంద నోటు పట్టుకుని వెళ్లే సామాన్యుడిని చూసి బజారు నవ్వుతోంది. ఏం కొనేద్దామని ఆ నోటు తెచ్చావంటూ వెక్కిరిస్తోంది. అవును మరి.. నడి బజారులో ధరల మంట రాజుకుంది. ఓ మధ్య తరగతి జీవి సగం జీతాన్ని మింగేసేలా, ఓ నిరుపేద కుటుంబం ఒక్క పూట కూరకే పరిమితమయ్యేలా, సగటు జీతగాడి సంచి సగం మాత్రమే నిండేలా నిత్యావసరాల ధరలు ఆకాశ మార్గం పట్టాయి. దీనికితోడు కొందరు వ్యాపారుల కృత్రిమ కొరత జనం కిరాణా షాపునకు వెళ్లడానికే భయం పుట్టేలా చేస్తున్నాయి.

అదుపు చేయలేని ప్రభుత్వం

మార్కెట్‌లో ప్రస్తుతం ధరలు మండిపోతున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ధరలు పెరిగిపోయాయంటూ గగ్గోలు పెట్టిన కూటమి పార్టీల నేతలు.. ప్రస్తుతం వారి పాలనలో వాటి ధరలను అదుపు చేయలేక పోతున్నారు. ధరలు నియంత్రించాల్సిన మార్కెటింగ్, పౌరసరఫరాల అధికారులు చోద్యం చూస్తుండడంతో బహిరంగ మార్కెట్లలో వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి మరీ అధిక ధరలకు అమ్మేసుకుంటున్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా బంగాళా దుంపల ధర ఏకంగా కిలోకి రూ.50కి చేరింది. అలాగే ఉల్లిపాయల ధరలు గత నాలుగైదు నెలలుగా రూ.50కి పైగానే పలుకుతున్నాయి. వందలోపు ఉన్న లీటర్ నూనె అమాంతం రూ.130కి పెరిగి పోయింది. కందిపప్పు కూడా రానురాను పేదోడికి అందకుండా పోతోంది.



నెల్లూరు నగరంలోని కూరగాయల మార్కెట్

ఈ ధరలు సామాన్యులకే కాదు హోటళ్ల నిర్వాహకులను కూడా బెదరగొడుతున్నాయి. అలాగే ప్రభుత్వం సంక్షేమ హాస్టల్స్, కస్తూర్బా స్కూల్, రెసిడెన్షియల్ స్కూల్ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఏం చేయాలో తెలీక నిర్వాహకులు తలలు పట్టుకుంటున్నారు. అప్పటి ధరలకు అనుగుణంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మెస్ చార్జీలు పెంచింది. కానీ ఇప్పుడు ధరలు మరింతగా పెరిగాయి. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని కోరుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన హామీల ప్రకారం నిరుపేద, సామాన్య, మధ్య తరగతి ప్రజలకు సంక్షేమ పథకాలు అందడంతో హాయిగా ఉండేది. కానీ కొత్త ప్రభుత్వం మాటలుతప్ప ఇప్పటి వరకు చేతలు చూపించలేకపోవడంతో సామాన్యుడికి కష్టాలు తప్పడం లేదు.



కాగుతున్న వంట నూనెలు

వంటనూనెలపై దిగుమతి సుంకం పెంచుతున్నట్లు కేంద్రం ప్రకటించిన వెంటనే వ్యాపారులు వంట నూనెల ధరలను పెంచేశారు. నూనె దిగుమతులపై సుంకాన్ని 12.5 శాతం నుంచి 32.5 శాతం వరకు కేంద్రం పెంచడంతో లీటరుకు రూ.20–రూ.25 వరకు ధర పెరిగింది. దిగుమతి సుంకానికి అదనంగా ఐదు శాతం స్టాండర్డ్ సెస్, పది శాతం అగ్రికల్చర్ సెస్ యాడ్ అవుతుంది. సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.112 నుంచి 130 వరకు పెరిగింది. రిటైల్ దుకాణాలలో మరో రూ.10 ఎక్కువగా అమ్ముతున్నారు.

కూర గాయాలే..

కూరగాయలు ఒకటీ రెండు మినహా మిగతావన్నీ కేజీ రూ.50కు తక్కువ లేదు. ఉల్లి రూ.70 పలుకుతుండగా క్యారెట్, బీన్స్ వంటివి కేజీ రూ.50లకు విక్రయిస్తున్నారు. ఎండుమిర్చి రూ.200 మార్కు దాటింది. చింతపండు రూ.140 తక్కువ లేదు. టమాటా రూ.50, పచ్చిమిర్చి రూ.80 లకు విక్రయిస్తున్నారు.

కూరగాయలు	(ఎంత నుంచి ఎంతకంటే)
టమోటా	40 - 50
వంకాయలు	40 - 50
పచ్చిమిర్చి	70 - 80
క్యారెట్	40 - 50
అల్లం	160 - 250
బీరకాయలు	40 - 50
కాకరకాయలు	50 - 60

> **నియంత్రణ చర్యలేవీ**
>
> 
>
> నెలరోజుల క్రితం నాటి కంటే నూనెల ధర లీటరుకు ఏకంగా రూ.20 పెరిగింది. ఒక్కసారిగా ధరలు పెరగడం మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలు కూడా పెరిగిపోయాయి.
> –మాధవి, కోటమిట్ట, నెల్లూరు

> **మధ్యతరగతిపై భారం**
>
> 
>
> గడిచిన మూడు మాసాల్లో నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు బాగా పెరిగాయి. గత ప్రభుత్వంలో ధరలు పెరిగాయని చెప్పిన కూటమి ప్రభుత్వం తమ పాలనలో ధరలను తగ్గించే ప్రయత్నం చేయడం లేదు. కొత్తగా వంట నూనె ధరలు కూడా పెరగడం ఆందోళన కల్గిస్తోంది. ధరల పెరుగుదల వల్ల మధ్యతరగతి కుటుంబాలపై అదనపు భారం పడుతోంది.
> – ఎం.విజయ, గృహిణి, మనుబోలు

పండుగల వేళ భయపెడుతున్న ధరలు

పండుగల సమయంలో వంటనూనెల ధరలు విపరీతంగా పెరగడంతో వినియోగదారులు భయపడుతున్నారు. మొన్నటి వినాయకచవితి పండుగ మొదలుకొని వచ్చే ఏడాది సంక్రాంతి పండుగ వరకు చాలా పండుగలున్నాయి. వచ్చే నెలలో దసరా, ఆపై దీపావళి, క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగలున్నాయి. ఈ క్రమంలో నూనెల ధరలు మరింత పెరుగుతాయని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వంటనూనెల ధరలు పెరగడం వలన ఇతర ఆహార పదార్థాల ధరలు కూడా పెరిగే అవకాశముంది.

నిత్యావసరాల ధరలు (రూ.లలో)

వస్తువులు	గత నెల	ప్రస్తుతం
కందిపప్పు	150	170
పెసరపప్పు	110	120
మినపపప్పు	110	125
ఉల్లిపాయలు	35	65
చింతపండు	150	165
వేరుశెనగపప్పు	125	135
తెల్లగడ్డలు	140	300

వంట నూనెలు

ఆయిల్స్	గత నెల	ఇప్పుడు
పామాయిల్	100	115
సన్‌ఫ్లవర్	112	130
రైస్ ఆయిల్	118	135
వేరుశెనగ	145	160

> **వ్యాపారులకూ నష్టమే**
>
> 
>
> కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకం పెంచడంతో వంటనూనెల ధరలు పెరిగాయి. ఈ విషయం సామాన్యులకు అర్థం కాదు. మేమేదో ధరలు పెంచామని అనుకుంటారు. లీటరుకు రూ.20కి పైగా పెరిగింది. ధరల పెంపుతో వ్యాపారాలు తగ్గే అవకాశముంది. అసలే వ్యాపారాలు అంతంత మాత్రంగా ఉన్న నేపథ్యంలో ధరల పెంపు అటు వినియోగదారునికి, ఇటు వ్యాపారులకు నష్టమే. – సత్యం, కిరాణా వ్యాపారి

> **సామాన్యులు కొనలేని పరిస్థితి**
>
> 
>
> కూరగాయలు ధరలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. ప్రభుత్వం ధరలను నియంత్రణ చేయాల్సి ఉంది. ఆయిల్ ధరలు కూడా ఇటీవల అమాంతం పెరిగాయి. దీంతో మాలాంటి సామాన్య ప్రజలపై పెనుభారం పడినట్లు అయింది.
> – భాగ్యరేఖ, ఎన్‌టీఆర్‌నగర్, నెల్లూరు

> **ప్రభుత్వం ధరలు తగ్గించాలి**
>
> 
>
> పప్పులు, ఆయిల్, ఇంకా నిత్యావసర వస్తువులు లేకుండా వంటలు చేయడం కుదరదు. ఇటీవల కాలంలో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటాయి. ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుని ఈ వస్తువుల ధరలు తగ్గేందుకు చర్యలు తీసుకోవాలి.
> –సీహెచ్ స్వాతి, ఎన్‌టీఆర్‌నగర్, నెల్లూరు

ఎమ్మెల్యే హామీ ఇస్తే నాకేంటి..



విజయమ్మను కొనసాగిస్తామని హామీ ఇస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్ (ఫైల్)

- నా పంచాయతీలో నా మాటే శాసనం
- ఎమ్మెల్యే హామీ ఇచ్చినప్పటికీ దళిత ఆశా కార్యకర్త తొలగింపు
- రావులకొల్లు సర్పంచ్ తీరుపై సర్వత్రా విమర్శలు

కలిగిరి: ఎమ్మెల్యే హామీ ఇస్తే నాకేంటి.. నా పంచాయతీలో నా మాటే శాసనం.. నేను చెప్పిందే వేదం.. నాకు నచ్చిన వారు మాత్రమే ఇక్కడ విధులు నిర్వహించాలనే తీరుతో టీడీపీ నాయకుడు, రావులకొల్లు సర్పంచ్ పూసాల వెంగపనాయుడు వ్యవహరిస్తున్న తీరుపట్ల సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రావులకొల్లులో ఆశా కార్యకర్తగా విధులు నిర్వహిస్తున్న దళిత మహిళ పందిటి విజయమ్మను తొలగించాలని వెంగపనాయుడు కంకణం కట్టుకున్నాడు. పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం ప్రయోగించినట్లు తన సర్పంచ్ పదవిని అడ్డుపెట్టుకుని విజయమ్మను తొలగించడానికి ముమ్మర ప్రయత్నాలు చేశాడు. పలుమార్లు తనకు అనుకూలమైన వారితో ఫిర్యాదులు చేయిస్తూ జిల్లా స్థాయిలో డీఎంహెచ్‌ఓ మీద ఒత్తిడి తీసుకువచ్చి ఎట్టకేలకు విజయమ్మను విధుల నుంచి తొలగించారు. దీంతో అంకితభావంతో విధులు నిర్వహిస్తూ, రాజకీయ ఒత్తిడిలకు నష్టపోయిన విజయమ్మకు మండలంలోని ఆశా కార్యకర్తలు, సీఐటీయు నాయకులు, పలువురు దళితల సంఘాల నాయకులు బాసటగా నిలిచారు. విజయమ్మను తిరిగి విధులలో చేర్చుకోవాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమాలు ప్రారంభించారు.

ఎమ్మెల్యే హామీ బేఖాతరు

విజయమ్మను ఆశా కార్యకర్త నుంచి తొలగించాలని సర్పంచ్ ప్రయత్నిస్తున్న నేపథ్యంలో సీఐటీయూ ఆధ్వర్యంలో అగష్టు 30వ తేదీన కలిగిరిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. అదే సమయంలో అటువైపు వెళుతున్న ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను ఆపి సీఐటీయూ నాయకులు, మండలంలోని ఆశా కార్యకర్తలు తమ సమస్యను తెలుపుకున్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే కాకర్ల మాట్లాడుతూ ఆశా కార్యకర్త విజయమ్మను తొలగించేది లేదని, నియోజకవర్గంలో చిరు ఉద్యోగులను టీడీపీ నాయకులు ఇబ్బందులు పెట్టకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే హామీ మేరకు ఆశా కార్యకర్తలు నిరసన కార్యక్రమాలు నిలిపివేశారు. కొద్ది రోజుల తర్వాత వెంగపనాయుడు తన పని తాను మొదలు పెట్టారు. ఎమ్మెల్యే హామీని బేఖాతరు చేస్తూ జిల్లా స్థాయి వైద్యాధికారుల మీద ఒత్తిడి తీసుకువచ్చి ఆమెను విధుల నుంచి తొలగించారు.

> **ఇంత వరకు ఒక్కతప్పు చేయలేదు**
>
> 
>
> 16 ఏళ్ల సర్వీసులో ఇంతవరకు ఒక్క తప్పు చేయలేదు. కేవలం తన సొంత మనుషులను నియమించుకోవాలనే ఉద్దేశంతోనే సర్పంచ్ నాపై కక్ష కట్టాడు. నిరుపేద దళితురాలైన నన్ను మానసికంగా క్షోభకు గురి చేస్తున్నారు. వెంటనే తనను తిరిగి విధుల్లోకి తీసుకుని న్యాయం చేయాలి.
> – పందిటి విజయమ్మ

ముగిసిన విద్యుత్ క్రీడాపోటీలు

- ఓవరాల్ చాంపియన్స్‌గా గుంటూరు, ఆర్‌టీటీపీ జట్లు
- విజేతలకు బహుమతులు అందజేసిన ఎస్‌ఈ

నెల్లూరు (వీఆర్సీసెంటర్): విద్యుత్ సంస్థలు (ట్రాన్స్‌కో, డిస్కం, జెన్‌కో) ఉద్యోగులకు నిర్వహించిన ఇంటర్ సర్కిల్ క్రీడాపోటీలు శనివారంతో ముగిశాయి. మూడురోజుల పాటు నెల్లూరు క్లబ్ నిర్వహిస్తున్న టెన్నిస్, బ్యాడ్మింటన్ పోటీల్లో చివరిరోజు శనివారం టెన్నిస్ విభాగంలో ఓవరాల్ చాంపియన్‌గా గుంటూరు జట్టు మొదటి స్థానంలో నిలిచింది. రెండు, మూడో స్థానాలలో వైజాగ్, కృష్ణపట్నం టీంలు నిలిచాయి. బ్యాడ్మింటన్ విభాగంలో ఓవరాల్ చాంపియన్‌గా ఆర్‌టీటీపీ జట్టు నిలువగా రెండవ స్థానంలో విజయనగరం, మూడవ స్థానంలో నెల్లూరు జట్టు నిలిచింది.

విజేతలకు బహుమతులు

క్రీడాపోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా ఎస్‌ఈ విజయన్ బహుమతులు, మెమొంటోలు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడా పోటీలలో విద్యుత్ ఉద్యోగులు ఉల్లాసంగా పాల్గొని వారి క్రీడాస్ఫూర్తిని చాటారని అన్నారు. ఈ క్రీడలను దిగ్విజయంగా నిర్వహించిన జిల్లా విద్యుత్ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ ఈఈ శ్రీధర్, స్పోర్ట్స్ ఆఫీసర్ కుమార్ వడివేలు, గేమ్స్ సెక్రటరీ వేలు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.



బ్యాడ్మింటన్ పోటీల్లో మూడో స్థానంలో నిలిచి బహుమతులు అందుకుంటున్న నెల్లూరు జట్టు సభ్యులు

విజేతలు వీరే...

టెన్నిస్ ఓపెన్ సింగిల్స్ విభాగంలో మొదటి స్థానంలో గుంటూరుకు చెందిన కె మహేష్, రెండో స్థానంలో నెల్లూరుకు చెందిన జెడ్ రాయ్, మూడో స్థానంలో నెల్లూరుకు చెందిన శ్రీనివాసరెడ్డిలు నిలిచారు. ఓపెన్ డబుల్స్ విభాగంలో మహేష్, మూర్తిలు మొదటి స్థానంలో నిలువగా, రెండవ స్థానంలో జడ్‌రాయ్, శ్రీనివాసరెడ్డిలు, మూడవ స్థానంలో సుందర్‌బాబు, ఉదయ్‌లు నిలిచారు.

బ్యాడ్మింటన్ విభాగంలో..

బ్యాడ్మింటన్ ఓపెన్ సింగిల్స్ విభాగంలో నెల్లూరుకు చెందిన ఉదయ్‌కుమార్ ప్రథముడిగా, కృష్ణపట్నంకు చెందిన చైతన్య ద్వితీయ, వీటీపీఎస్‌కు చెందిన నాగరాజు తృతీయ స్థానంలో నిలిచారు. ఓపెన్ డబుల్స్ విభాగంలో ఆర్‌టీపీపీకు చెందిన సంతోష్, రాజులు ప్రథమం, నెల్లూరుకు చెందిన ఉదయ్, రంగారావులు ద్వితీయం, వైఎస్సార్ జిల్లాకు చెందిన షరీఫ్, సంతోష్‌లు తృతీయ స్థానాల్లో నిలిచారు.

ప్రశాంతమ్మా... ఇదేంటమ్మా!

- నిర్మాణంలో ఉన్న కార్యాలయానికి మళ్లీ శంకుస్థాపనా?
- గతంలోనే నిధులు మంజూరు చేసిన మాజీ ఎమ్మెల్యే ప్రసన్న
- ఎన్నికలు రావడంతో ఆగిపోయిన భవన నిర్మాణ పనులు
- నేడు వాటికే మళ్లీ కొబ్బరికాయ కొట్టేందుకు ఏర్పాట్లు
- విస్తుపోతున్న బుచ్చిరెడ్డిపాళెం ప్రజలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: గతంలో మేజర్ పంచాయతీగా ఉన్న బుచ్చిరెడ్డిపాళేన్ని 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి చొరవ చూపి నగర పంచాయతీగా మార్చారు. కొంతకాలానికి భవన నిర్మాణానికి రూ.1.20 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. అప్పటి జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబుతో కలసి మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు రూ.30 లక్షలు చెల్లించారు. పునాది వరకు నిర్మాణం పూర్తయింది. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పనులు నిలిచిపోయాయి. తాజాగా నగర పంచాయతీ కార్యాలయ పనులను అధికారులు మొదలు పెట్టారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. గతంలో నిధులు మంజూరు చేసి పనులు మొదలుపెట్టిన నగర పంచాయతీ కార్యాలయానికి కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఆదివారం మళ్లీ శంకుస్థాపన చేయడానికి ఏర్పాట్లు చేయడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అవి చేస్తాం, ఇవి చేస్తాం అని టీడీపీ నాయకులు ఊదరగొట్టారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోగా గత ప్రభుత్వంలో మొదలైన అభివృద్ధి పనులకు మళ్లీ శంకుస్థాపన చేయడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల సమయంలో ప్రశాంతిరెడ్డి నగర పంచాయతీలో రోడ్లు సరిగాలేవు, డ్రైయిన్లు నిర్మించలేదని విమర్శించారు. తమ పార్టీ అధికారం చేపట్టిన వెంటనే అభివృద్ధి పనులను పరుగులు పెట్టిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తయింది. ఈ మూడు నెలల్లో బుచ్చిరెడ్డిపాళెం మండలంలో ఏ ఒక్క అభివృద్ధి పనిని ప్రారంభించలేదు. సంక్షేమం, అభివృద్ధి పనుల మీద దృష్టి సారించకుండా వైఎస్సార్‌సీపీ నాయకులు, కౌన్సిలర్లను తమ పార్టీలో చేర్చుకోవడానికే ప్రశాంతి రెడ్డి సమయం వెచ్చిస్తున్నారని, ఇక ఏమీ చేయలేక గతంలో చేసిన పనులకు మళ్లీ శంకుస్థాపనలు చేసి తమ ఖాతాలో వేసుకునేందుకు కుట్ర పన్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు.



పునాదుల దశలోనే నిలిచిపోయిన నగర పంచాయతీ కార్యాలయ నిర్మాణం

పక్కా స్కెచ్‌తో దోపిడీ

- రూ.50 లక్షల దోపిడీ కేసు ఛేదన
- మేనల్లుడే సూత్రధారి
- ప్రధాన నిందితుడు టీడీపీ మైనార్టీ సెల్ నేత
- నలుగురు నిందితుల అరెస్ట్
- రూ 21.21 లక్షల నగదు, రెండు కార్లు స్వాధీనం
- పరారీలో ప్రధాన నిందితుడు



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న నెల్లూరు రూరల్ డీఎస్పీ శ్రీనివాస్

నెల్లూరు (క్రైమ్): నగదు కోసం ఓ వ్యక్తి పక్కా స్కెచ్ వేశాడు. మేనమామ, అతని స్నేహితులకు తక్కువ ధరకే పొలాలు ఇప్పిస్తానని నమ్మించి తమ ప్రాంతానికి రప్పించాడు. స్నేహితులతో నకిలీ పోలీసుల అవతారమెత్తించి నగదు దోపిడీ చేయించాడు. అనంతరం సమానంగా పంచుకుని పరారయ్యారు. సాంకేతికత ఆధారంగా దోపిడీ కేసులో నలుగురు నిందితులను 24 గంటల్లోనే పోలీసులు అరెస్ట్ చేశారు. నెల్లూరురూరల్ పోలీసుస్టేషన్‌లో శనివారం రాత్రి దోపిడీ కేసు పూర్వాపరాలను నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాస్ వెల్లడించారు. తోటపల్లిగూడూరు మండలం కోడూరుకు చెందిన సద్దాం హుస్సేన్ టీడీపీ మైనార్టీ సెల్ నేత. అతని మేనమామ ఉస్మాన్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పాండిచ్చేరిలో ఉంటున్నాడు. ఆయనకు ముత్తుకూరు పరిసర ప్రాంతాల్లో తక్కువ ధరకే పొలాలు ఇప్పిస్తానని, అడ్వాన్స్ కింద రూ.50 లక్షలు తీసుకుని వస్తే అగ్రిమెంట్ చేయిస్తానంటూ సద్దాం హుస్సేన్ చెప్పాడు. ఉస్మాన్, తన స్నేహితులతో కలిసి పొలాలు కొనేందుకు శుక్రవారం వస్తానని చెప్పాడు.

స్నేహితులతో కలిసి నగదు దోపిడీకి ప్లాన్

తన మేనమామ తెచ్చే డబ్బులు కాజేయాలని సద్దాం హుస్సేన్ నిర్ణయించుకున్నాడు. ఇదే విషయాన్ని తన స్నేహితుడైన అల్లూరు మండలం ఇస్కపాళెం పంచాయతీ లబ్బిపాళెంకు చెందిన షేక్ హసన్‌కు తెలియజేశాడు. హసన్ తన స్నేహితులతో కలిసి పోలీసు వేషధారణలో నగదు కాజేస్తామని, ఆ డబ్బును సమానంగా వాటా ఇవ్వాలని చెప్పాడు. దోపిడీ ప్లాన్‌ను ఇస్కపల్లికి చెందిన జాన్‌బాషా, బీద రవీంద్ర, కొత్తఢిల్లీ జామియానగర్‌కు చెందిన ఇర్షాద్ తదితరులకు చెప్పాడు. ఈ నేపథ్యంలో ఉస్మాన్ తన స్నేహితులతో కలిసి డబ్బులు తీసుకుని శుక్రవారం ముత్తుకూరుకు వచ్చాడు. సద్దాం హుస్సేన్‌కు ఫోన్ చేయగా పిడతాపోలూరు సమీపంలోని జెన్‌కో రోడ్డు వద్దకు రావాలని సూచించారు. ఉస్మాన్ అక్కడికి వెళ్లే సరికి అప్పటికే హసన్ తన స్నేహితులతో పోలీసు వేషధారణలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్నట్లు నటించసాగారు. ఉస్మాన్ కారు రాగానే నిందితులు కారును తనిఖీ చేస్తున్నట్లు నటిస్తూ నగదుతో ఉన్న సంచిని తీసుకుని పరారయ్యేందుకు ప్రయత్నించారు. దీంతో బాధితులు ప్రతిఘటించారు. నిందితులు వారిపై దాడి చేసి నగదు సంచిని లాక్కొన్నారు. ఇంతలో బాధితులు నిందితుల కారుకు గాలి తీసేశారు. దీంతో నిందితులు నగదు సంచితో మరో వాహనంలో పరారయ్యారు.

ప్రత్యేక బృందాలు రంగంలోకి..

బాధితుడు ఉస్మాన్ ఫిర్యాదు మేరకు ముత్తుకూరు పోలీసులు కేసు నమోదు చేశారు. నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాస్ ఘటనా స్థలాన్ని పరిశీలించి దోపిడీ జరిగిన తీరును బాధితులను అడిగి తెలుసుకున్నారు. ఘటనా స్థలంలో నిందితుల వాహనాన్ని స్వాధీనం చేసుకుని వివరాలు సేకరించారు. కృష్ణపట్నంపోర్టు, కోవూరు, పొదలకూరు సీఐలు, సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సాంకేతికత ఆధారంగా నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

విమానాశ్రయంలో పట్టుబడిన నలుగురు నిందితులు

దోపిడీ అనంతరం సద్దాం, హసన్ నగదును పంచుకుని చెరో దారి వెళ్లిపోయారు. హసన్, జానీబాషా, రవీంద్ర, ఇర్షాద్ నగదుతో ఇతర రాష్ట్రాలకు పరారయ్యేందుకు ఎయిర్‌పోర్టులో ఉన్నారని పోలీసులకు పక్కా సమాచారం అందింది. పోలీసులు చెన్నై ఎయిర్‌పోర్టుకు చేరుకుని ఇమ్మిగ్రేషన్ అధికారుల సహాయంతో శనివారం నిందితులు నలుగురిని అదుపులోకి తీసుకుని నెల్లూరుకు తరలించారు. అనంతరం వారిని తమదైన శైలిలో విచారించగా దోపిడీ జరిగిన తీరును వెల్లడించారు. దీంతో నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ 21.21 లక్షల నగదు, జాగ్వార్, బొలేరో కార్లను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న సద్దాం, మరి కొందరి కోసం పోలీసులు గాలిస్తున్నారు. హసన్‌పై ఇప్పటికే తక్కువ ధరకే బంగారం, నకిలీ కరెన్సీ తదితర కేసులు ఉన్నాయని డీఎస్పీ చెప్పారు.

సిబ్బందికి అభినందనలు

దోపిడీ కేసును 24 గంటల వ్యవధిలోనే ఛేదించి నిందితులను అరెస్ట్ చేసేందుకు కృషి చేసిన కృష్ణపట్నంపోర్టు, కోవూరు, పొదలకూరు, వెంకటాచలసత్రం సీఐలు ఎం. రవినాయక్, సుధాకర్‌రెడ్డి, రాంబాబు, సుబ్బారావు, ఎస్‌ఐలు విశ్వనాథ్‌రెడ్డి, వీరేంద్రబాబు, ప్రసాద్‌రెడ్డి, ఆంజనేయులు, నెల్లూరు రూరల్ సబ్ డివిజన్ క్రైమ్ పార్టీ సిబ్బంది కె. గిరిధర్‌రావు, గంగాధర్, సతీష్, సీసీఎస్ సిబ్బంది డి. శ్రీనివాసులు, గిరిధర్, సుబ్రహ్మణ్యం, ప్రభాకర్, కరిముల్లా, సాయిఆనంద్, సీహెచ్ శ్రీనివాసులు, ఎస్ వెంకటేశ్వర్లు తదితరులను డీఎస్పీ అభినందించి రివార్డుల కోసం ఎస్పీకి సిఫార్సు చేశారు. ఈ సమావేశంలో కృష్ణపట్నం పోర్టు, పొదలకూరు సీఐలు రవినాయక్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న నగదు

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కంటైనర్

- డ్రైవర్ దుర్మరణం, మరో డ్రైవర్‌కు గాయాలు





నుజ్జయిన కంటైనర్ వాహనం (ఇన్‌సెట్‌లో) కొండేటి రవి మృతదేహం

కొడవలూరు: నిద్ర మత్తులో ఆగి ఉన్న లారీని వెనుక నుంచి కార్గో కంటైనర్ వాహనం ఢీకొంది. ఈ దుర్ఘటనలో కంటైనర్‌లో నిద్రపోతున్న డ్రైవర్ దుర్మరణం చెందగా, కంటైనర్‌ను నడుపుతున్న మరో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన మండలంలోని రాచర్లపాడు వద్ద శనివారం ఉదయం 11 గంటల సమయంలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు.. పేపర్ లోడుతో నెల్లూరు వైపు వెళ్తున్న లారీని రాచర్లపాడు వద్ద రోడ్డు పక్కన నిలిపి డ్రైవర్ బహిర్భూమికి వెళ్లాడు. విజయవాడ నుంచి చెన్నై వెళ్తున్న కార్గో కంటైనర్ వాహనానికి ఇద్దరు డ్రైవర్లు ఉండగా లక్ష్మణరావు అనే డ్రైవర్ వాహనాన్ని నడుపుతున్నాడు. మరో డ్రైవర్ కొండేటి రవి (45) కంటైనర్ వాహనంలోనే డ్రైవర్ పైభాగంలో ఉన్న సీట్లో నిద్రపోతున్నాడు. కంటైనర్‌ను నడుపుతున్న లక్ష్మణరావు బోగోలు వద్దకు వచ్చే సరికి నిద్ర రాగా, నిద్రపోతున్న డ్రైవర్ రవిని లేపి వాహనాన్ని తోలితే తాను నిద్ర పోతానని చెప్పాడు. కోవూరు వరకు తీసుకెళ్లితే.. అక్కడి నుంచి తాను నడుపుతానని రవి చెప్పాడు. రాచర్లపాడు వద్దకు వచ్చేసరికి లక్ష్మణరావు నిద్ర మత్తులోకి జారుకుని రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. దీంతో కంటైనర్ వాహనం ముందు భాగం నుజ్జుయ్యి కంటైనర్ వాహనంలో నిద్రపోతున్న డ్రైవర్ కొండేటి రవి అక్కడికక్కడే మృతి చెందారు. కంటైనర్ వాహనాన్ని నడుపుతున్న డ్రైవర్ లక్ష్మణరావు కాలికి గాయం కావడంతో హైవే అంబులెన్స్‌లో వైద్యశాలకు తరలించారు. ఎస్సై సీహెచ్ కోటిరెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి డ్రైవర్ రవి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమ వివాహం ఇష్టం లేకనే..

- శ్రావణిని తల్లిదండ్రులే కడతేర్చారు
- మృతురాలి తల్లిదండ్రులు, సహకరించిన చెంచయ్య అరెస్ట్
- సోదరి, సోదరుడిని త్వరలోనే అరెస్ట్ చేస్తాం
- కొడవలూరు సీఐ ఎ. సురేంద్రబాబు వెల్లడి



శ్రావణి హత్య కేసు వివరాలను వెల్లడిస్తున్న సీఐ సురేంద్రబాబు

కొడవలూరు: కూతురు ప్రేమ వివాహం చేసుకోవడం ఇష్టం లేకనే కొడవలూరు మండలం పద్మనాభసత్రంకు చెందిన శ్రావణి (24)ని తల్లిదండ్రులు తిరుమూరు వెంకటరమణయ్య, దేవసేనమ్మ హత్య చేశారని కొడవలూరు సీఐ ఎ.సురేంద్రబాబు వెల్లడించారు. కొడవలూరు పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రావణి హత్యకు పాల్పడిన తల్లిదండ్రులు, సహకరించిన చెంచయ్యను అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ శ్రావణి ఐదేళ్ల క్రితమే భర్తతో విడిపోయి తల్లిదండ్రుల వద్దే ఉంటోందన్నారు. ఆమెకు మరో వివాహం చేసేందుకు తల్లిదండ్రులు ఏర్పాట్లు చేస్తున్న సమయంలో ఆమె అల్లూరు మండలం నార్తు ఆములూరుకు చెందిన రబ్బానిబాషాతో ప్రేమలో పడి అతడితో వెళ్లిపోయిందన్నారు. ప్రేమ వివాహం నచ్చని తల్లిదండ్రులు నార్తుఆములూరుకు వెళ్లి శ్రావణిని బలవంతంగా ఇంటికి తీసుకువచ్చారని తెలిపారు. ప్రేమకు స్వస్తి చెప్పి తాము చెప్పిన యువకుడిని వివాహం చేసుకోవాలని శ్రావణిపై తల్లిదండ్రులు ఎంతో ఒత్తిడి తెచ్చారన్నారు. తల్లిదండ్రులు ఎంతగా చెప్పినప్పటికీ శ్రావణి నిర్ణయం మార్చుకోకపోవడంతో హతమార్చాలని తల్లిదండ్రులు నిర్ణయించుకున్నారని చెప్పారు. ఈ క్రమంలో గత నెల 24న రాత్రి శ్రావణిని తల్లిదండ్రులు, సోదరి భువనేశ్వరి, సోదరుడు సాయి మురళీకృష్ణ కొట్టి బలవంతంగా పురుగుల మందు తాగించాలని చూశారన్నారు. వీలు కాకపోవడంతో శ్రావణి కాళ్లు, చేతులను తాడుతో కట్టేసి చీరను మెడకు చుట్టి గట్టిగా లాగి హత్య చేశారని తెలిపారు. శ్రావణి చనిపోయిందని నిర్ధారణకు వచ్చాక మృతదేహాన్ని ఇంటి పక్కనున్న వారి ఖాళీ స్థలంలో పాతి పెట్టారన్నారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు విచారణ చేయగా కుటుంబ సభ్యులే హత్యకు పాల్పడినట్లు వెలుగులోకి వచ్చిందన్నారు. పాతి పెట్టిన శ్రావణి మృతదేహాన్ని వెలికి తీసి శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించగా, మృతదేహం శ్రావణిదేనని నిర్ధారించడం జరిగిందని తెలిపారు. ఈ కేసులో శ్రావణి తల్లిదండ్రులు, సహకరించిన చెంచయ్యను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరుస్తున్నామని చెప్పారు. హత్యతో సంబంధమున్న శ్రావణి అక్క భువనేశ్వరి, తమ్ముడు సాయి మురళీకృష్ణను త్వరలోనే అరెస్ట్ చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎస్సై సీహెచ్ కోటిరెడ్డి, ఏఎస్సై గంధం ప్రసాద్, రైటర్ పి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి	: రూ.100
సన్నవి	: రూ.50
పండ్లు	: రూ.35

కృష్ణపట్నం తీరంలో వ్యర్థాల ఏరివేత

- ఇండియన్ కోస్టుగార్డు కోస్టల్ క్లీనప్ డే



ఏరిన చెత్త, కోస్టుగార్డులు, విద్యార్థులతో కమాండెంట్ అజిత్‌కుమార్ బరబ్

ముత్తుకూరు: మండలంలోని కృష్ణపట్నం తీరంలో శనివారం 'ఇంటర్నేషనల్ కోస్టల్ క్లీనప్ డే' జరిగింది. కమాండింగ్ ఆఫీసర్ కమాండెంట్ అజిత్‌కుమార్ బరబ్ ఆధ్వర్యంలో కోస్టుగార్డులు, ముత్తుకూరు హైస్కూల్ విద్యార్థులు, పోలీసులు, మెరైన్ పోలీసులు, పోర్టు ఉద్యోగులు, మత్స్యశాఖ, మున్సిపల్ ఉద్యోగులు, ఎన్‌సీసీ క్యాడెట్లు, మత్స్య కళాశాల విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు సుమారు 400 మందికిపైగా తీరంలో ప్లాస్టిక్ చెత్త, వ్యర్థాలను పూర్తిగా తొలగించి శుభ్రం చేశారు. పర్యావరణాన్ని దెబ్బ తీసే ప్లాస్టిక్ వినియోగాన్ని నిలిపివేయాలని నినాదాలు చేశారు.